సాక్షి ప్రకాశం

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



కొలతల మేత.. అంతా రోత

మార్కాపురం మండలంలో సర్వేయర్ల చేతివాటం తారస్థాయికి చేరింది. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి డబ్బులు అందితేనే పొలంలో కాలుపెడుతున్నారు. - 8లో..



బయటకొస్తే బండపడినట్లే..

కురిచేడు మండలం దేకనకొండలో సోమవారం రాత్రి ప్రారంభమైన రాళ్లదాడి మంగళవారం కూడా కొనసాగింది. గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
35.4/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ప్రయాగ్‌రాజ్-బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా ప్రయాగ్‌రాజ్-బెంగళూరు మధ్య ప్రత్యేక వారంతపు రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 13 నుంచి అక్టోబర్ 17 వరకు ప్రతి ఆదివారం ప్రయాగ్‌రాజ్-బెంగళూరు ప్రత్యేక రైలు (04131) నడుస్తుంది. అదే విధంగా ఈ నెల 16 నుంచి అక్టోబర్ 20 వరకు ప్రతి బుధవారం బెంగళూరు-ప్రయాగ్‌రాజ్ ప్రత్యేక రైలు (04132) నడుస్తుంది.

ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్స్ తుది నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు: దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్స్ మూడవ, తుది నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్స్ దరఖాస్తు చేసుకోవడానికి నేడు చివరి తేదీ అన్నారు. ఈనెల 11 నుంచి 13 వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు సంబంధించి తమ కాలేజీ సహాయ కేంద్రం కూడా పనిచేస్తుందని చెప్పారు. డిగ్రీలో చేరే విద్యార్థులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ 9490474225 నంబర్‌ను సంప్రదించవచ్చు. విద్యార్థులు తప్పనిసరిగా బుధవారంలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అనంతరం వెబ్ ఆప్షన్లకు ఈనెల 11 వ తేదీ నుంచి 13 వ తేదీ వరకు పెట్టుకోవాలని, వెబ్ ఆప్షన్ మార్పులకు ఈనెల 16 వ తేదీ ఏమైనా తప్పులుంటే సహాయ కేంద్రానికి వచ్చి సరి చేసుకోవాల్సిందిగా తెలిపారు.

15లోగా ఓపెన్ స్కూల్ దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ విద్యనభ్యసించేందుకు ఆసక్తిగలవారు ఈనెల 15లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా చైర్మన్ డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు రూ.200 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని ఓపెన్ స్కూళ్ల స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్లు గమనించి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్లు గత ఏడాదికంటే ఈ ఏడాది అదనంగా కనీసం 10 శాతం అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

ఈ-చలానాలు రద్దు చేయాలని 17న ధర్నా




మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఒంగోలు టౌన్: ఈ-చలానాలు రద్దు చేయాలని, పర్మినెంట్ స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 13వ తేదీ మండల కేంద్రాల్లో, 17వ తేదీ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఒంగోలు నగర ఆటో యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు నగరంలో 10 పర్మినెంట్ ఆటో స్టాండులు ఏర్పాటు చేయాలని తంబి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జరిగే ధర్నాల్లో ఆటో కార్మికులు పాల్గొనాలని కోరారు.

సంక్షేమ, విద్యా సహాయకుల బదిలీలు

ఒంగోలు సెంట్రల్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా సంక్షేమ, విద్యా సహాయకుల బదిలీల ప్రక్రియ నిర్వహించారు. డ్వామా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ ఉషా రాణి, ప్రకాశం, బాపట్ల జిల్లా ఎస్సీ సంక్షేమాధికారులు ఎన్ లక్ష్మా నాయక్, జే రాజదిబోరా పాల్గొని బదిలీ ప్రక్రియకు పాటించాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు. 312 మంది దరఖాస్తు చేసుకోగా 274 మంది హాజరైనట్లు ఎస్సీ జిల్లా సంక్షేమాధికారి లక్ష్మా నాయక్ తెలిపారు.



బదిలీల ప్రక్రియలో పరిశీలిస్తున్న జిల్లా అధికారులు



ఉప్పు కొఠార్లలో ఉన్న ఉప్పు కుప్పలు

మెరిసిపోతున్న తెల్ల బంగారం

ఉప్పు ధరలకు రెక్కలొచ్చాయి. గత ఏడాది 75 కేజీల బస్తా ధర రూ.200 పలుకగా ఈ దఫా రూ.300లకు పెరిగింది. సముద్రపు ఉప్పు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో రైతులు కొటారులను వదల్లేక, అలాగని సాగు చేసి నష్టాలు భరించలేక నానా ఇబ్బందులు పడ్డారు. ఒక దశలో ఉప్పు సాగు ఆపేద్దామని తీర్మానం చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రైతులు లాభాల బాట పట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

- పెరుగుతున్న ఉప్పు ధరలు
- ఆనందంలో రైతులు
- 75 కేజీల బస్తా ధర రూ.300
- ఉమ్మడి జిల్లాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో సాగు
- వాతావరణ మార్పులతో ఆగిన ఉప్పు తయారీ

సింగరాయకొండ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చిన గంజాం, కనపర్తి, పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి పంచాయతీ పరిధిలో జోరుగా ఉప్పు సాగవుతోంది. సుమారు 4 వేల ఎకరాల్లో దీనిని సాగు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం తప్ప మిగిలిన కాలాల్లో 9 నెలల పాటు సాగు చేస్తారు. మామూలుగా ఎకరాకు 75 కేజీల బస్తా సుమారు రూ.800 నుంచి రూ.900 వరకు తయారవుతుంది. ఈ ఏడాది వాతావరణం పూర్తిగా అనుకూలించడంతో సుమారు 1300 నుంచి 1400 బస్తాల వరకు ఉత్పత్తి వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రకారం ప్రతినెలా సుమారు 20 వేల టన్నుల వరకు ఉప్పు ఉత్పత్తి జరుగుతోంది. ఉప్పు తయారీ బాగా ఉండటంతో ఉమ్మడి జిల్లాలో 7 వేల మందికి పైగా ఉప్పు రైతులు, సుమారు 10 వేల మందికి పైగా కూలీలు ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారు. గత ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో ఉప్పు రైతులు ధరల్లేక అవస్థలు పడ్డారు. ఉప్పు సాగుచేసే కొటారులు వదల్లేక, అలాగని సాగు చేసి నష్టాలు భరించలేక నానా ఇబ్బందులు పడ్డారు. ఒక దశలో సాగు నిలిపేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

రైతుల కళ్లల్లో ఆనందం..

ఉమ్మడి జిల్లాలో ఉప్పు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. గత సంవత్సరం ఇదే సీజన్‌లో ఉప్పు 75 కేజీల బస్తా ధర కేవలం రూ.200 పలికింది. ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే ఉప్పు తయారీ ప్రారంభమైంది. సీజన్ ప్రారంభంలో 75 కేజీల బస్తా ధర రూ.150. దీంతో గత ఏడాదిని గుర్తుకు తెచ్చుకుని రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే ధరలు క్రమేపీ పెరుగుతూ వచ్చాయి. తొలుత రూ.150 ఉన్న ధర రూ.200లకు పెరిగింది. ప్రస్తుతం రూ.300 వస్తోంది. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న ఉప్పు నాణ్యమైనదిగా ఉండడంతో మంచిరేట్లు పలుకుతున్నాయి. 2015 నుంచి 2019 వరకూ ఉప్పు రైతులకు అన్నీ కష్టాలే. కనీస గిట్టుబాటు ధర లభించకపోవడంతో నష్టాల్లో కూరుకుపోయారు. దీనికి తోడు వ్యాపారులు సిండికేట్ కావడంతో రైతులు కుదేలైపోయారు. 75 కేజీల బస్తా ధర 2015, 16 సంవత్సరాల్లో రూ.60 పలికింది. 2017లో రూ.90, 2018లో రూ.100, 2019లో రూ.120 ఇలా క్రమంగా ధరలు పెరుగుతూ వచ్చాయి. 2020 తర్వాత రైతుల పరిస్థితి మారిపోయింది. ఉప్పు ధరలు సైతం అమాంతం పెరిగిపోయాయి. 75 కేజీల బస్తా ధర రూ.200 నుంచి రూ.225కి పెరిగింది. నాలుగేళ్లుగా ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. గత ఏడాది సీజన్‌లో రూ.265 పలికినా తర్వాత ధరలు తగ్గుతూ వచ్చాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

దళారీలను అరికట్టాలి

ఉప్పు వ్యాపారంలో దళారులు ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. వీరు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి ఉప్పు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో దళారులు ఆడిందే ఆటగా సాగుతోంది. ఫలితంగా పూర్తి స్థాయి లాభాలు ఆర్జించలేకపోతున్నామని ఉప్పు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పు వ్యాపారంలో దళారీ వ్యవస్థను రూపుమాపాలని అధికారులను కోరుతున్నారు. ప్రస్తుతం మండలం నుంచి తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు ఉప్పు సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం ఉప్పు రైతులకు అండగా నిలిస్తే ఉప్పు ఉత్పత్తి ద్వారా అధిక లాభాలు ఆర్జిస్తామని ఉప్పు రైతులు తెలియజేస్తున్నారు.



నిల్వ చేసిన ఉప్పు

ఉప్పు ధరలు ఆశాజనకం



నేను 10 ఎకరాలు కౌలుకు తీసుకుని ఉప్పు సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ధరలు పెరుగుతుండటంతో ఉప్పు నిల్వ చేశాను. ప్రస్తుతం 75 కేజీల బస్తా ధర రూ.300 పలుకుతోంది.

– పురిణి శ్రీనివాసులరెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

ఆర్బీకేల ద్వారా ఉప్పు కొనుగోలు చేయాలి



2.5 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం ప్రారంభంలో ధరలు తక్కువగా ఉన్నా దిగుబడి బాగా వచ్చింది. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ఉప్పు కొనుగోలు చేస్తే రైతుకు మంచి ధరలు లభిస్తాయి.

– గౌరవరపు రాములు, ఉప్పురైతు, ఊళ్లపాలెం

75 కేజీల బస్తా రూ.300కు అమ్ముతున్నాం



నేను 4 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నాను. నాలుగేళ్లుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఉప్పుకు మంచి ధర లభించింది. ఈ సంవత్సరం కూడా ఉప్పు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. 75 కేజీల బస్తాను రూ.300 అమ్ముకుంటున్నాను.

– పురిణి దేవారెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

వర్చువల్ మీటింగ్ కోసం ఎదురుచూస్తున్నాం

- మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, అడిషనల్ డైరెక్టర్ రాజమన్నార్

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణానికి సంబంధించి ఈ ఏడాది జూలై 18న న్యూఢిల్లీలోని జాతీయ వైద్యమండలి వారికి అప్పీల్ కోసం ప్రతిపాదనలు పంపామని, వారు చేసే వర్చువల్ మీటింగ్ తేదీ కోసం ఎదురు చూస్తున్నామని మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, అడిషనల్ డైరెక్టర్ ఎస్.రాజమన్నార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాక్షిలో 'మెడి'కలే'నా' వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది జూన్ 24న జాతీయ వైద్య కౌన్సిల్ వారు మార్కాపురం మెడికల్ కళాశాలను పర్యవేక్షించారన్నారు. అదే నెల 28వ తేదీ వర్చువల్ హియరింగ్ జరిగిందని ఆ హియరింగ్‌లో మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్ లేదని చెప్పారన్నారు. ఎల్‌ఓపీ ఇవ్వకపోవడానికి పలు కారణాలు తెలిపారన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలు, లేడీస్, జంట్స్ హాస్టల్ భవనాలు పూర్తికాకపోవడం, సీనియర్ రెసిడెన్సీ భవనాలు, కళాశాల ఇతర భవనాలు పూర్తికాకుండా నిర్మాణ దశలో ఉండటం, అధ్యాపక బృందం 41.2 శాతంగా ఉండటం, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ బృందం సరిపడా లేకుండా 78.8 శాతంగా ఉండటం, హాస్టల్స్‌లో సరైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడం, బెడ్ ఆక్యుపెన్సీ 35 శాతంగా ఉండటం వలన ఎల్‌ఓపీ ఇవ్వలేదని తెలిపారని అన్నారు. అయితే మళ్లీ తాను ఈ ఏడాది జూలై 18న న్యూఢిల్లీలోని జాతీయ వైద్యమండలికి తిరిగి పర్యవేక్షణ కోసం అప్పీల్ చేశామని, వర్చువల్ పర్యవేక్షణ తేదీ కోసం ఎదురుచూస్తున్నామని రాజమన్నార్ తెలిపారు.

ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు టౌన్: ఇరు వర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులందరూ సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. సెప్టెంబర్ 14 వ తేదీ దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారని, కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రాజీ అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇద్దరి ఆమోదంతో పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్నవారు ఉపయోగించుకొని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్ లో పరిష్కరించుకున్న కేసుల్లో తీర్పు అంతిమ తీర్పు అని పేర్కొన్నారు. కోర్టుల్లో చెల్లించిన ఫీజును కూడా తిరిగి పొందవచ్చని తెలిపారు. ప్రీ సిట్టింగ్ రూపంలో ఇరు వర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు సహకరిస్తారన్నారు.

నిర్దేశించిన రుణాలు మంజూరు చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బ్యాంకర్లు ప్రభుత్వం నిర్దేశించిన రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఆ మేరకు జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలన్నారు. మంగళవారం ప్రకాశం భవనంలో డీసీసీ (డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ) సమావేశం నిర్వహించారు. జిల్లాలో బ్యాంకులు నిర్దేశించిన పలు రకాల రుణాల లక్ష్యాలు సాధించిన ప్రగతి పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి 2024 మార్చి 31వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.17,988 కోట్లకు రూ.30,975.15 కోట్ల రుణాలు మంజూరు చేసి 172 శాతం ఆర్థిక ప్రగతిని సాధించినట్లు



బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

చెప్పారు. అదేవిధంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.20,591.18 కోట్లుగా నిర్ణయించారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలకు సంబంధించి ఖరీఫ్‌లో రూ.3900.40 కోట్ల లక్ష్యానికి 2024 జూన్ 30వ తేదీ నాటికి రూ.2,368.97 కోట్ల రుణాలను అందచేసి 60.73 శాతం ఆర్థిక ప్రగతిని సాధించినట్లు వివరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 32,657 స్వయం సహాయక సంఘాలకు రూ.1671.3 కోట్ల రుణాల లక్ష్యం ఉంటే జూన్ 30 నాటికి 7982 సంఘాలకు రూ.616.19 కోట్లు మంజూరు చేసి 24.44 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. మెప్మా ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 430 స్వయం సహాయక సంఘాలకు రూ.5555.65 కోట్లు మంజూరు చేశారన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు వసుంధర, రవికుమార్, వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యశాఖ జేడీలు శ్రీనివాసులు, బేబిరాణి, జనార్దన్ రెడ్డి, ఉద్యానవన అధికారి గోపిచంద్, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, డీటీడబ్ల్యూ జన్నాథరావు, చేనేత ఏడీ ఉదయ్‌కుమార్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగిలా నటిస్తూ చోరీ

- నిద్రలో ఉన్న రోగి తల్లి పర్సు చోరీ
- రూ.25 వేల నగదు ఎత్తుకెళ్లారని కన్నీరు పెట్టుకున్న బాధితురాలు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చోరీ జరిగింది. చికిత్స కోసం వచ్చిన రోగి పర్సును తస్కరించాడో దొంగ. మద్దిపాడు మండలం కీర్తిపాడు గ్రామానికి చెందిన మేడా తిరుమల ఒంటరి మహిళ. పొగాకు గ్రేడింగ్ పనులు చేసుకొని జీవనం కొనసాగిస్తోంది. ఆమెకు ఇద్దరు సంతానం. కూతురు కోటేశ్వరి, కుమారుడు కోటేశ్వరరావు ఉన్నారు. వారిద్దరికి వారం రోజులుగా జ్వరం వస్తుండడంతో చికిత్స కోసం నాలుగు రోజుల క్రితం వారిని తీసుకొని జీజీహెచ్‌కు వచ్చింది. రోగ నిర్ధారణ పరీక్షలు చేసిన వైద్యులు డెంగీ జ్వరం అని నిర్ధారించి మూడో అంతస్తులోని జనరల్ వార్డులో చేర్పించి చికిత్స చేస్తున్నారు. ఎందుకైనా మంచిదని కూలి పనులకు వెళ్లగా వచ్చిన డబ్బులతో పాటుగా బ్యాంకులో పైసా పైసా కూడబెట్టుకున్న డబ్బులు మొత్తం రూ.25 వేలు తెచ్చి పర్సులో దాచిపెట్టుకుంది. సోమవారం రాత్రి పర్సును తలకింద పెట్టుకొని నిద్రపోయింది. తెలవారుజామున లేచి చూస్తే పర్సు కనిపించలేదు. వార్డు మొత్తం వెదికినా కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె ఔట్‌పోస్టులో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ సీఐ వై.నాగరాజు ఆస్పత్రిని సందర్శించి సీసీ కెమెరాలు పరిశీలించారు. అర్ధరాత్రి పక్క బెడ్డు మీద ఉన్న ఒంగోలుకు చెందిన ముస్తఫా పర్సును తీసుకెళ్లడం సీసీ పుటేజీలో గమనించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ముస్తఫా ఆరు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ఎలాంటి ఆధారాలు చూపకుండా ఒంగోలు చిరునామాతో అతడు ఆస్పత్రిలో చేరడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రిలో ఉన్న కొందరు రోగులతో కనిగిరికి చెందిన వాడిగా అతడు పరిచయం చేసుకున్నట్లు తెలుస్తోంది. రోగిలా నటిస్తూ ఆస్పత్రిలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



బాధితురాలు తిరుమల

జీజీహెచ్‌లో తరచుగా దొంగతనాలు...

జిల్లా కేంద్రంలో ఉన్న సర్వజన ఆస్పత్రికి ఒంగోలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రతి రోజు కనీసం 700 నుంచి వెయ్యి మంది వరకు చికిత్స కోసం వస్తుంటారు. వీరిలో 150 కేసులు అత్యవసరమైనవి కాగా మరో 100 కేసులకు పైగా అడ్మిషన్లు జరుగుతుంటాయి. రోగులు, వారి కుటుంబ సభ్యులతో ఆస్పత్రి లోపల, బయట ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటుంది. ఎవరు వస్తున్నారో, ఎవరు పోతున్నారో అర్థం కానీ పరిస్థితి ఉంటుంది. ఇక్కడ తరచుగా పేషంట్ల వద్ద నుంచి డబ్బులు దొంగతనాలకు గురవుతున్నాయి. అనేక మంది రోగులు వార్డులో ఉన్నప్పుడో, ఆస్పత్రిలోకి వచ్చి పోయే సమయంలోనో తన డబ్బులు పోయినట్లు తరచుగా ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. ఇక ప్రతిరోజూ కనీసం 15కు పైగా సెల్ ఫోన్లు చోరీకి గురవుతున్నట్లు సమాచారం. ఆస్పత్రిలో పనిచేసే వైద్యులకు, సిబ్బందికి, ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు రక్షణ లేకుండా పోయిందని ఇటీవల ఆందోళన చేసిన జూడాలు ఆరోపించడం తెలిసిందే. పోలీసు పెట్రోలింగ్ పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఈ చోరీతో తెలిసిపోతుంది. ఇప్పటికైనా జీజీహెచ్ వద్ద భద్రత పెంచాలని, చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందంగా ఏదైనా పెద్ద సంఘటన జరిగేంత వరకు వేచి చూసే ధోరణి మంచిది కాదని పలువురు విమర్శిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశించారు.. మంత్రి శాసించారు..

- ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో ట్రాక్టర్‌ను సీజ్ చేసిన బ్రేక్ ఇన్‌స్పెక్టర్
- ఇసుక ట్రాక్టర్ పోలీసులకు అప్పగింత
- మంత్రి డోలా ఆదేశాలతో ట్రాక్టర్‌ను వదిలేసిన జరుగుమల్లి పోలీసులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఇసుక దందాపై కలెక్టర్ కన్నెర్ర చేశారు.. బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌ను పంపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పజెప్పారు. సాయంత్రానికి మంత్రి ఫోన్ చేశారు. పోలీసులు ట్రాక్టర్‌ను వదిలేశారు. ఈ ఘటన జరుగుమల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జరుగుమల్లి మండలం చింతలపాలెం ఇసుక రీచ్ నుంచి వారం రోజులుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. దీనిపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. జిల్లా పోలీస్ అధికారులు స్పందించడంతో రెండు రోజులు విరామం ఇచ్చారు. వినాయక చవితి పండుగ ముగిసిన మరుసటి రోజు నుంచి తిరిగి రావాణా కొనసాగించారు. మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి సొంత గ్రామమైన నాయుడుపాలేనికి మంగళవారం ఉదయం 6 గంటల నుంచే అక్రమ రవాణా ప్రారంభమైంది. నాయుడుపాలెంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఇసుక కావాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఇచ్చిన లేఖపై ఉదయం నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.. వాస్తవానికి ఇంజినీరింగ్ అధికారికి ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చే అధికారం లేదు. అనుమతి ఇచ్చే అధికారం మైనింగ్ శాఖ అధికారులకే ఉంది. ఈ అక్రమ రవాణాపై మండల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో గ్రామస్తులు జేసీ, ఒంగోలు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో చివరికి మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా కు ఫోన్ చేసి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ ఫొటోలు పంపారు. వెంటనే ఆమె స్పందించి బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌ను పంపి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆదేశించారు. దీంతో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ జరుగుమల్లి వస్తుండగా మున్నంగి సీ పుడ్స్‌కు వెళ్లే అడ్డరోడ్డు వద్దకు రాగానే టంగుటూరు వైపు 1809 నంబర్ ట్రాక్టర్ వెళుతోంది. ట్రాక్టర్‌ను ఆపి ఇసుక అనుమతికి కాగితాలు చూపించాలని అడిగారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ తన వద్ద ఉన్న పంచాయతీరాజ్ అధికారి లెటరు చూపించగా 'ఇది అనుమతి పత్రం కాదని నాలుక గీక్కోడానికి కూడా పనికిరాదు' అంటూ ట్రాక్టర్‌ను సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు అప్పగించి వెళ్లిపోయారు. తరువాత ఆరు గంటలకు ట్రాక్టర్‌ను పోలీసులు వదిలిపెట్టడంతో వెంటనే గ్రామస్తులు విషయాన్ని కలెక్టర్‌కు తెలిపారు. తరువాత బ్రేక్ ఇన్‌స్పెక్టర్ గ్రామస్తులకు ఫోన్ చేసి ఈ ఒక్క బండి గురించి వదిలేయండి. మంత్రి స్వామి తన గ్రామంలో సిమెంట్ రోడ్లకు ఇసుక తోలుతున్నారని చెప్పారని అందుకు వదిలిపెట్టానని, కలెక్టర్ తనను ఇసుక అక్రమ రవాణాపై నియమించారని, రేపటి నుంచి గ్రామంలో ఉండి అక్రమ రవాణాను అడ్డుకుంటానని తెలిపారని గ్రామస్తులు వివరించారు. ఈ విధంగా అక్రమ రవాణాను అడ్డుకోవాలని కలెక్టర్ ఆదేశిస్తే మంత్రి స్వామి అక్రమ రవాణాకు సహకరించడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సిమెంట్ రోడ్లకు వెళుతున్న ట్రాక్టర్లు నాయుడుపాలేనికి పోకుండా టంగుటూరు, జమ్ములపాలెం తదితర ప్రాంతాలకు వెళుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక పక్క నాయకుల ఒత్తిడి, మరో పక్క ఉన్నతాధికారుల ఆదేశాలతో నలిగిపోతున్నామని మండల అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సెబ్ అధికారులు మా శాఖను ఎక్సైజ్‌లో విలీనం చేస్తున్నారు మాకు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అవసరం లేదని చెబుతుండడం కొసమెరుపు.



జరుగుమల్లి మండలం చింతలపాలెం రీచ్ నుంచి మధ్యాహ్నం 11.49 గంటలకు పోలీస్‌స్టేషన్ ముందుగా వెళుతున్న ఇసుక ట్రాక్టర్

క్లుప్తంగా

గొడ్డలితో దాడి.. తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన నాగయ్య

అర్ధవీడు(బేస్తవారిపేట): పాత కక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేయడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన యాచవరం ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..పాత కక్షల నేపథ్యంలో కటికల చంద్ర అనే వ్యక్తి బిక్షాల నాగయ్యపై గొడ్డలితో దాడి చేశాడు. నాగయ్య కంటి, తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై బి. సుదర్శన్‌యాదవ్ తెలిపారు. చంద్రను అదుపులోకి తీసుకున్నారు.

కారుణ్య నియామకపత్రం అందజేత



కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన బి. సుబ్బారావు కుమారుడు క్రాంతి కుమార్‌కు మంగళవారం ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు కారుణ్య నియామక పత్రం అందజేశారు. డీపీఓలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ అవకాశాన్ని కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, వృత్తి నైపుణ్యం పెంపొందించుకొని అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సులోచన, సూపరింటెండెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి



ఖలీల్ మృతదేహం

కంభం: విద్యుదాఘాతానికి కూలి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం కంభంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. షేక్ ఖలీల్(32) గ్రానైట్, టైల్స్ పరిచేందుకు రోజు వారి కూలిగా వెళ్తుంటాడు. స్థానిక గరల్స్‌హైస్కూల్ సమీపంలోని ఓ గృహంలో మంగళవారం పని చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో టూరిస్ట్ బస్ క్లీనర్ కిందకు జారిపడి మృతి చెందాడు. ఈ సంఘటన త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే ఒరిస్సాలోని భువనేశ్వర్‌కు చెందిన భక్తులు దక్షిణ బారత యాత్రకు బయలుదేరారు. టూరిస్టు బస్సు వెల్లంపల్లి వద్దకు రాగానే డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో క్లీనర్ ఠాగూర్ కిందకు జారిపడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది వైద్యశాలకు తరలించే లోపే మృతి చెందాడు. ఎస్సై బసవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న ఎక్సయిజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ

ఒంగోలు: మాదక ద్రవ్యాలతో జీవితం నాశనమవుతుందని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్విస్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లి బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మానసికంగా యువత దృఢంగా ఉండేలా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు అవసరమైన శిక్షణ కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు అందిస్తుందన్నారు. యువత చైతన్యవంతులై మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఆత్మహత్య ఆలోచనా ధోరణి మానసిక ఆరోగ్యానికి సంబంధించి తీవ్రమైన విషయమన్నారు.

కొలతల మేత.. అంతా రోత!

- నిస్సిగ్గుగా సచివాలయ సర్వేయర్ల చేతివాటం
- వాట్సాప్ కాల్స్‌లోనే బేరసారాలు
- పచ్చ నోట్లు చేతిలో పెడితేనే భూముల సర్వే
- డబ్బు లేకుంటే ఆన్‌లైన్ క్లోజ్



సమయపాలన పాటించక తాళంవేసి ఉన్న గజ్జలకొండ- 1 సచివాలయం

మార్కాపురం రూరల్: ప్రజా సేవకులుగా ఉన్న అధికారులు డబ్బు మత్తుకు బానిసలవుతున్నారు. పచ్చనోట్ల కోసం పేదలను పీల్చి పిప్పి చేస్తున్నారు. మండలంలోని సచివాలయ సర్వేయర్ల చేతివాటం తారస్థాయికి వెళ్లింది. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి డబ్బులు అందితేనే పొలంలోకి కాలుపెడతామంటూ బహిరంగంగానే దందాలు చేస్తున్నారు. మార్కాపురం మండలంలోని పలు సచివాలయాల్లో సర్వేయర్ల దెబ్బకు జనం విలవిల్లాడుతున్నారు. రైతులు తమ పొలాల కొలతల కోసం గవర్నమెంటుకు చలానా కట్టుకున్నా కూడా లంచం అడుగుతున్నారు. రైతులు సర్వేయర్లకు ఫోన్లు చేస్తున్నా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తూ పనులు దాట వేస్తున్నారు. తమ పైఅధికారులు వేరే పనులు అప్పగించారని.. మీ పనులు చేయడానికి కుదరదంటూ తేల్చి చెప్పేస్తున్నారు. 15 రోజులు గడువు ముగిసే ముందు రైతులకు ఫోన్ చేసి ఆఫీసుకు వచ్చి సంతకాలు పెట్టి వెళ్లాల్సిందిగా హుకుం జారీ చేస్తున్నారు. వారి మాటలు నమ్మి రైతులు సంతకాలు పెడితే సర్వే చేసేసినట్లు ఆన్‌లైన్‌లో క్లోజ్ చేస్తూ నిస్సిగ్గుగా ప్రవర్తిస్తున్నారు. తరువాత దందాలు మొదలు పెడుతున్నారు. సచివాలయ సర్వేయర్లు ఈ బేరసారాలన్నీ వాట్సాప్ కాల్స్ ద్వారానే చేస్తున్నారు. మీరిచ్చే డబ్బులు మాకు మాత్రమే కాదయ్యా... మండల సర్వేయర్‌కు కూడా ఇవ్వాలని బాహాటంగానే చెబుతున్నారు. దీంతో చేసేదేమీలేక రైతులు వారు అడిగినంత డబ్బులిచ్చి పొలం సర్వే చేయించుకుని కొలతలు చేయించుకుంటున్నారు.

> **ప్రతి పనికీ లంచం అడుగుతున్నారు**
>
> 
>
> సచివాలయ సిబ్బందితో పాటు సర్వేయర్ కూడా ప్రతి పనికీ లంచం అడుగుతున్నారు. సమయానికి సచివాలయాలకు రాకుండా కాలయాపన చేస్తున్నారు. సచివాలయకు లేటుగా వచ్చి బయోమెట్రిక్ వేసి ఏదొక పనుందని చెబుతూ ప్రజలకు అందుబాటులో ఉండకుండా వెళ్లిపోతున్నారు.
>
> – నాథ గురుబ్రహ్మం, సర్పంచ్, రామచంద్రాపురం

ఏసీబీ అధికారులకు సమాచారం

ఇటీవల కాలంలో మార్కాపురం మండలం అమ్మవారిపల్లి గ్రామస్తులు కూడా లంచం ఇచ్చి పని చేయించుకున్నారు. గజ్జలకొండ సచివాలయం- 2 పరిధిలోని రైతులు సర్వే చేయాలని అర్జీ ఇచ్చినప్పటికీ సర్వేయర్ స్పందించలేదు. మొన్నటివరకూ ఎన్నికల విధుల్లో ఉన్నానంటూ ఇప్పుడు అధికారులు తమకు వేరేపనులు అప్పజెప్పారని తప్పించుకు తిరుగుతున్నాడు. దరిమడుగు సచివాలయ సర్వేయర్ అయితే విస్తీర్ణం చొప్పున రైతుల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. తిప్పాయిపాలెం, చింతగుంట్ల తదితర గ్రామాల్లోని సచివాలయంలో పనిచేసే సర్వేయర్లు కూడా ఇదే పంథాలో ఉన్నట్లు పలువురు రైతులు తెలిపారు. కొందరు సర్వేయర్లు రైతులకు ఫోన్‌చేసి తాముండేది కొన్నిరోజులు మాత్రమే అని.. ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడు సంపాదించుకోవాలంటూ రైతులతో వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వేయర్ల పనితీరుపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. అంతేకాక ఇప్పటికే కొందరు సర్వేయర్లపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందినట్లు సమాచారం.

> **సచివాలయం చుట్టూ తిరుగుతున్నా**
>
> 
>
> సచివాలయంలో పనులకోసం వెళ్తే సిబ్బంది లేకపోవడంతో వెనుతిరిగి వెళ్తున్నాను. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులు, పేదల కష్టాలు గుర్తించి సక్రమంగా ఉద్యోగాలు చేసుకోవాలి.
>
> – అల్లూరయ్య, రైతు, అమ్మవారిపల్లి



ఇళ్లపై నుంచి రాళ్లు రువ్వుతున్న కూటమి వర్గీయులు

బయటకొస్తే బండ పడినట్లే!

- తగ్గని రాళ్లదాడి
- ఒకరికి గాయాలు
- కూరగాయల సంచుల్లో రాళ్ల సరఫరా
- దేకనకొండ గ్రామంలో కొనసాగుతున్న ఉద్రిక్తత



పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ, సీఐ



గ్రామంలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

కురిచేడు: మండలంలోని దేకనకొండ గ్రామంలో సోమవారం రాత్రి ప్రారంభమైన రాళ్లదాడి మంగళవారం కూడా కొనసాగింది. పోలీసులు గ్రామంలో ఉండగానే కూటమి వర్గీయులు.. కూరగాయల సంచుల్లో కూరగాయలు తెచ్చుకుంటున్న చందంగా రాళ్లను తమ ఇళ్లపైకి చేర్చుకుని మంగళవారం ఉదయం మరలా రాళ్లదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పడిగపాటి అంజిరెడ్డి కి రక్తగాయాలయ్యాయి. గ్రామంలో భయానక వాతావరణం సృష్టించటమే తమ లక్ష్యమని బహిరంగంగా కూటమి వర్గీయులు సవాళ్లు విసురుతున్నారు. గ్రామంలో బయట నుంచి కొందరు వ్యక్తులను పిలిపించి గొడవకు సన్నద్ధమవుతున్నారు. మంగళవారం రాత్రికి మరలా దాడిచేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు పోలీసులకు.. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, క్షతగాత్రులు తెలిపారు. ఎలాగైనా బుధవారం వైఎస్సార్ సీపీ వర్గీయులు ఏర్పాటు చేసుకున్న గణేశనిమజ్జనం జరగకుండా చేయటమే లక్ష్యం గా పెట్టుకున్నట్లు గ్రామంలో అక్కడక్కడా ప్రచారం జరుగుతోంది. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నట్లు తెలిసింది. ఉదయం 10 గంటల వరకు కొనసాగిన రాళ్లదాడి.. పోలీసు బలగాలు గ్రామంలోకి రావటంతో సద్దుమణిగింది.

పోలీసు వలయంలో దేకనకొండ

మండలంలోని దేకనకొండ గ్రామం పోలీసుల అదుపులోకి వెళ్లింది. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు సీఐ సూరేపల్లి సుబ్బారావు ప్రత్యేక బలగాలను రప్పించి గ్రామాన్ని తమ కంట్రోలులోకి తెచ్చుకున్నారు. దీంతో ఉదయం వరకు రెచ్చిపోయిన కూటమి నాయకుల కుతంత్రాలుకు అడ్డుకట్టపడింది. గ్రామంలో ఎవరైనా బయటకు వచ్చినా, గొడవకు సిద్ధపడ్డా వారిని అరెస్టు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి పహారా కాస్తున్నారు.



రాళ్లు రువ్వుతున్న వారిని వారిస్తున్న పోలీసులు



సంచులతో తెచ్చుకున్న రాళ్లు

కనిగిరిలో ఆర్మీ సైకిల్ యాత్ర



ఆర్మీ సైకిల్ యాత్ర బృందంతో సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎంఈఈ జీ సంజీవి, అధికారులు

కనిగిరి రూరల్: ఇండియన్ ఆర్మీ 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్మీ అధికారులు, సిబ్బంది చేపట్టిన ఆర్మీ సైకిల్ సాహస యాత్ర మంగళవారం కనిగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు, పలువురు అధికారులు, పట్టణ ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మీ జూనియర్ కమిషన్డ్ అధికారి గురూన్‌జీ, మేజర్‌లు రావత్, అభిజీత్ మాట్లాడారు. జాతీయ సమైఖ్యత, దేశ భద్రత, రక్షణలో భాగస్వామ్యం పై అవగాహన, పర్యావరణ పరిరక్షణ, ఆర్మీ పై అవగాహన తదితర అంశాలపై వివరించారు. ఈ యాత్ర కాశ్మీర్ (లడాక్) లోని సియాచిన్ దగ్గర నుంచి అండమాన్ నికోబార్ దీవుల్లోని ఇందిరా పాయింట్ వరకు సాగుతుందన్నారు. మొత్తం 5,500 కి.మీల దూరం సాగే యాత్రలో భాగంగా ఇప్పటి వరకు 3,269 కి.మీల దూరం సైకిల్ యాత్ర బృందం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎస్సై టీ త్యాగరాజు, ఎంఈఓ జీ సంజీవి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు.. స్థానిక చర్చి సెంటర్ నుంచి కళాశాల వరకు 400 అడుగుల భారీ జాతీయ జెండాతో ఆర్మీ సైకిల్ యాత్రకు ఘన స్వాగతం పలికారు.



జాతీయ జెండాతో విద్యార్థుల స్వాగతం

హెచ్‌ఎంలు నిధులు సద్వినియోగం చేయాలి

- డీఈవో సుభద్ర

ఒంగోలు: జిల్లాలో ఎంపిక చేసిన పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా పాఠశాల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ సహకారంతో ముందడుగు వేయాలని జిల్లా విద్యా శాఖాధికారి డి.సుభద్ర పేర్కొన్నారు. స్థానిక సమగ్రశిక్ష సమావేశం మందిరంలో మంగళవారం జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, మండల విద్యాశాఖాధికారి-2 లకు నిర్వహించిన సమీక్ష సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్లే గ్రౌండ్, కెమిస్ట్రీ ల్యాబ్‌నకు మంజూరైన నిధులను మార్గదర్శకాలు అనుసరించి ఖర్చు చేయాలని, మంజూరైన స్కూల్ గ్రాంట్స్ కోసం వివరాలు వెంటనే అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఎస్.సుబ్బారావు, సమగ్ర శిక్ష డీఈ మన్నయ్య, ఎంఈవో యం.రమేష్, మండల విద్యాశాఖాధికారు-2, ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న డీఈవో డి.సుభద్ర

ఇదేం కక్ష సాధింపు

- ఒకే రేషన్ దుకాణంలో నాలుగు సార్లు తనిఖీ
- కొలతల్లో తేడా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగిన అధికారులు



రేషన్ షాపు తనిఖీ చేస్తున్న అధికారులు

దర్శి: 'ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా నాలుగుసార్లు ఒకే రేషన్ దుకాణంపై తనిఖీ. ఒక్క అరకేజీ అయినా ఎక్కువో, తక్కువో చూయించి కేసు నమోదు చేసి దుకాణాన్ని స్వాధీనం చేసుకోవాలి' ఇదీ దర్శి మండలంలోని పెద ఉయ్యాలవాడ రేషన్ దుకాణంపై అధికారుల కక్ష సాధింపు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఇప్పటికీ మూడుసార్లు ఆ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన అధికారులు మంగళవారం నాల్గో సారి తనిఖీకి వచ్చారు. గతంలో ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ ఒకసారి, ఆర్‌ఐ ఒకసారి, మరోసారి వీఆర్‌ఓలు రాగా..మంగళవారం ఇన్‌చార్జి ఆర్‌ఐతో పాటు ఐదుగురు వీఆర్‌ఓలు, కానిస్టేబుల్ తనిఖీకి వచ్చారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు తనిఖీ చేశారు. ముఠా వాళ్లను పిలిపించి దుకాణంలో ఉన్న బియ్యం మొత్తాన్ని బయట వేసి కాగా వేశారు. అయినా తనిఖీల్లో ఒక్క కేజీ కూడా సరుకు తేడా గుర్తించలేకపోయారు. దింపిన సరుకు దింపినట్లు ఉంది. ఇప్పటి వరకు రేషన్ బండిని పంపకుండా ఆపారు. దీంతో గ్రామంలో ఎవరికీ రేషన్ ఇవ్వలేదు. అయితే రోజంతా తనిఖీ చేసినా ఏం చేయలేకపోయామన్న బాధ వీఆర్‌ఓల్లో కనిపించింది. మరో పక్క డీలర్ రాజీనామా చేయాలని అధికారుల నుంచి బెదిరింపులు వస్తున్నాయి.

జగన్ బొమ్మ చూస్తే పచ్చ నేతలకు వణుకు



పోస్టర్‌పై ఉన్న వైఎస్ జగన్ ఫొటోను తొలగించిన సిబ్బంది

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మ చూస్తేనే పచ్చ నేతలకు వణుకు మొదలవుతుంది. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆ పరిస్థితి ఏర్పడింది. సచివాలయం నోటీసు బోర్డులో ఉన్న జగన్ బొమ్మను చూసి వాళ్లలో ఆవేశంతో కూడిన వణుకు మొదలయింది. కాసేపు తమ వర్గానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డిపై చిందులు తొక్కారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి సంబంధించిన సూచనలతో కూడిన వాల్‌పోస్టర్‌ను సచివాలయం- 2కు సంబంధించిన నోటీసు బోర్డులో అంటించారు. ఆ పోస్టర్‌పై జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ముద్రించి ఉంది. ప్రభుత్వం మారినప్పటికీ ఆరోగ్యశ్రీపై ప్రజలకు అవగాహన కోసం ఆ వాల్‌పోస్టర్‌ను సిబ్బంది తొలగించలేకపోయారు. ఆ ప్రాంతంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ నాయకులు అక్కడికి చేరారు. కాగా సచివాలయ నోటీసు బోర్డుపై ఉన్న ఈ వాల్‌పోస్టర్‌ను చూసిన పచ్చ నాయకులు గజ గజ వణకిపోయారు. ఆయన ఫొటోతో ఉన్న వాల్‌పోస్టర్ పంచాయతీ పరిధిలో ఎక్కడ ఉన్న సహించేదిలేదని.. వెంటనే వాటిని తొలగించాలని హుకుం జారీ చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి నోటీసు బోర్డులో ఉన్న వాల్ పోస్టర్‌ను తొలగించారు.

యోధుల త్యాగాలు చిరస్మరణీయం

- వీరనారి ఐలమ్మ, బషీర్‌బాగ్ అమరుడు రామకృష్ణ వర్ధంతి సభలో వక్తలు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో పాల్గొని ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన యోధులను చరిత్రను ఎప్పటికీ మరచిపోదని రజక వృత్తిదారుల సంఘ జిల్లా నాయకులు టంగుటూరి రాము అన్నారు. చిట్యాల ఐలమ్మ, విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన రామకృష్ణ వర్ధంతి సభ మంగళవారం ఎల్బీజీ భవనంలో నిర్వహించారు. ఇద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరి అమలవుతున్న రోజుల్లో వెనకబడిన రజక కుటుంబంలో పుట్టిన ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన పోరాటంలో క్రియాశీల పాత్ర పోషించారని తెలిపారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి 10 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిపెట్టిన పోరాటంలో ఐలమ్మ పాత్ర మరవలేనిదన్నారు. ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని తెలంగాణలో అనేక పోరాటాలు పురుడుపోసుకున్నాయన్నారు. 2000లో నాటి చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ ధరలతో ప్రజలు అల్లాడిపోయారని, ప్రజలు పెద్ద ఎత్తును తరలివచ్చి హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో చేపట్టిన ఉద్యమకారులపై చంద్రబాబు ప్రభుత్వం చేయించిన పోలీసు కాల్పుల్లో బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్తెనపల్లి రామకృష్ణ అమరులయ్యారని తెలిపారు. ఉద్యమం జరిగి 24 ఏళ్లు గడుస్తున్నా విద్యుత్ ధరలు పెంచడానికి నేటికీ ప్రభుత్వాలు భయపడుతున్నాయని, అలాంటి పోరాటాలు చేస్తేనే ప్రభుత్వాలు దిగి వస్తాయని చెప్పారు. జిల్లా రజక వృత్తిదారుల సంఘం నాయకుడు తోటా తిరుపతిరావు మాట్లాడుతూ ఐలమ్మ, రామకృష్ణ లాంటి పోరాట యోధుల అడుగుజాడల్లో నడవాలని, నేటి తరానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆవులమంద రమణమ్మ, సీహెచ్ కోటేశ్వరరావు, చిట్యాల కొండయ్య, మంచికలపాటి శ్రీనివాసరావు, పోలయ్య, వేములపాటి మల్లికార్జునరావు, పొదిలి మల్లికార్జున, కల్లగుంట శ్రీనివాసరావు, సంజీవయ్య పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించం



ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాలు, ప్రజాసంఘాలు

ఒంగోలు టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలన్న యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, లేకుంటే ఉద్యమిస్తామని కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచనకు వ్యతిరేకంగా మంగళవారం నగరంలోని సాగర్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణను అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని సెయిల్‌లో విలీనం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటుపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దురుద్దేశంతోనే విశాఖ ఉక్కుకు గనులను కేటాయించకుండా కేంద్రం కుయుక్తులు పన్నుతుందని ఆరోపించారు. గత 6 నెలలుగా కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని విమర్శించారు. ధర్నాలో ప్రజాసంఘాల నాయకులు లలిత కుమారి, కల్పన, ఆదిలక్ష్మి, పమిడి వెంకటరావు, షేక్ మాబు, ఎంఏ సాలార్, సర్దార్, ఆర్ మోహన్, నాగరాజు, శేఖర్, దామా శ్రీనివాసులు, బంకా సుబ్బారావు, టి మహేష్, వీరారెడ్డి, జయంతిబాబు పాల్గొన్నారు.